# భావితరాలకు అందించాల్సిన సిరిసంపదలు 'చమేలీ పుష్పాలు'



జె. వేణిమాధవి
నేచురలిస్ట్
www.vedicvanas.com


(గత సంచిక తరువాయి)

## సరస్వతీ వనం - చమేలీ పుష్పం



పద్మజా పద్మవంశా చ పద్మరూపే నమో నమః।
పరమేష్ట్యై పరామూర్త్యై నమస్తే పాపనాశినీ॥

మహాదేవ్యై మహాకాళ్యై మహాలక్ష్మై నమో నమః।
బ్రహ్మవిష్ణుశివాయై చ బ్రహ్మనార్యై నమో నమః॥

గత సంచికలో చమేలీ పువ్వుకు గల వివిధ నామాలు, ఔషధ గుణాలు, వాటి పరిమళాలను వెలికితీసే పద్ధతులను గురించి వివరంగా తెలుసుకున్నాం. ఈ సంచికలో ఈ దివ్యపుష్పం గురించి మరిన్ని విశేషాలను తెలుసుకొందాం. మగువల మనస్సులు దోచే ఈ పువ్వులు కవులు, మునులు, ఋషులు, దేవతలను ఏవిధంగా మెప్పిస్తాయో, ఇవి ఏ కోవకు చెందుతాయో మొదలైన విశేషాలను చూద్దాం.

## స్థలవృక్షంగా అలరారుతున్న చమేలీ

దక్షిణాదిన ప్రత్యేకించి తమిళనాట వున్న పుణ్యక్షేత్రాల్లో సాధారణంగా మనకి మూడు అంశాలు ప్రస్ఫుటంగా కనిపిస్తాయి. అవి మూర్తి, స్థలం, తీర్థం. ఇక్కడ స్థలం అంటే దేవాలయం ఏర్పడిన ప్రాంతం, స్థలవృక్షాలు. గతంలోనే మనం స్థలవృక్షాల గురించి చాలా వివరంగా తెలుసుకున్నాం. చమేలీ మొక్క కూడా వివిధ పుణ్యక్షేత్రాల్లో స్థలవృక్షంగా వుంది. వాటిలో ఒకదాని గురించిన పురాణగాథను తెలుసుకొందాం.

## భక్త మార్కండేయుడు

పరమశివభక్తుడైన మార్కండేయుని కథ మనందరికీ సుపరిచితమే. ఆ కథనే క్లుప్తంగా పరికిద్దాం. పూర్వం మృకండు మహర్షి, మరుద్వంతులు సంతానలేమితో బాధపడుతూ తపమాచరిస్తుండగా శివుడు ప్రత్యక్షమై వారికి తేజోవంతుడు, అల్పాయుష్కుడైన పుత్రుడు కావాలా లేక దీర్ఘాయువు కలిగి బుద్ధిమాంద్యుడైన పుత్రుడు కావాలో కోరుకోమనగా, వారు అల్పాయుష్కుడినే కోరుకున్నారు. కొద్దికాలానికే వారికి మార్కండేయుడు జన్మించాడు. అతడు పెరిగి పెద్దవాడౌతున్న సమయంలో తన తల్లిదండ్రుల మనోవేదనకు కారణం తెలుసుకొని, శివుడి కొరకు తపస్సు చేయడానికి అడవులకు వెళతాడు. కావేరీ నది సమీపంలో అనువైన చోటులో శివలింగాన్ని ప్రతిష్ఠించి పూజ చేయసాగాడు. అక్కడ అంతర్వాహినిగా ప్రవహిస్తున్న గంగాజలంతో ఆ లింగాన్ని అభిషేకించే వాడు. ఆ జలంతో పాటు చమేలీ పువ్వులు



కూడా వచ్చేవి. ఆ ప్రాంతంలో ఈ పువ్వులను పింగిళం, జాతిమల్లి అని వ్యవహరించే వారు. మార్కండేయుడు ఆ పువ్వులతో పాటు అడవిలోని పుష్పాలు, పళ్ళను శివుడికి నివేదించేవాడు. ఇదిలా వుండగా మార్కండేయునికి పదహారేండ్లు నిండేసమయానికి యమకింకరులు, ఆ మీదట యమధర్మరాజు స్వయంగా వచ్చి అతడి ప్రాణాలను హరించేందుకు విఫలయత్నం చేసారు.

ఆ ప్రయత్నంలో యమపాశం మార్కండేయునితో పాటు శివలింగంపై కూడా పడింది. అచంచలమైన మార్కండేయుని భక్తివిశ్వాసాలకు పరవశించిన పరమశివుడు ప్రత్యక్షమై యముడిని సంహరించి,



వివిధ క్షేత్రాల్లో కాలసంహారమూర్తి శిల్పాలు



కుక్కలు చెప్పులు వెదకునట్లు, నీచులు ఇతరుల దోషాలు వెతకడానికి ప్రయత్నిస్తారు.

ఆ బాలభక్తుడిని చిరంజీవిగా వర్థిల్లమని వరమిచ్చాడు. ఈ సందర్భం లోనే శివుడికి 'కాలాంతకుడు' అన్న పేరు వచ్చింది. తర్వాత మార్కండే యుని కోరిక మేరకు తిరిగి యముడిని బతికించి అనుగ్రహిస్తాడు.

*(ఈ గాథ మార్కండేయ పురాణం, భాగవత పురాణం, మహాభారతం మొదలైన గ్రంథాల్లో ప్రస్తావించబడింది. ఆ కారణం చేత కొన్ని వ్యత్యాసాలు వుండే అవకాశం వుంది. పాఠకులు గమనించగలరు.)*

ఈ పురాణగాథ తమిళనాడులో మయిల్దుత్తురైకి సమీపంలో గల తిరుక్కడయూర్ అన్న పుణ్యక్షేత్రంలో జరిగినట్లు అక్కడి స్థలపురాణం తెలుపుతోంది. అక్కడి శివుడిని కాలసంహారమూర్తి, అమృతఘటేశ్వరుడు అని కూడా పిలుస్తారు. అక్కడి శివలింగంపై యమపాశానికి సంబంధించిన గుర్తులు కూడా స్పష్టంగా కనిపిస్తుంటాయిట. అక్కడి అమ్మవారి పేరు అభిరామి. ఆ ప్రాంతంలో అంతర్వాహినిగా ప్రవహిస్తున్న గంగాతీర్థం ఇప్పటికీ వుండటం విశేషం. ఆ నీటితోనే స్వామివారికి అభిషేకం చేస్తుంటారు. అది ఇప్పటికీ అలాగే వున్నట్లు తెలుస్తోంది.

చమేలీ మొక్క ఈ దివ్యక్షేత్రం యొక్క స్థలవృక్షంగా స్థలపురాణంలో పేర్కొనబడింది. ఈ క్షేత్రంలో బిల్వ, రేల చెట్లను కూడా స్థలవృక్షాలుగా వేరొక పురాణంలో ప్రస్తావించడం విశేషం. ఒకే క్షేత్రంలో ఒకటి కంటే ఎక్కువ స్థలవృక్షాలు వుండటం సహజమే.





## షష్టిపూర్తి - ఆయుష్ హోమాలు

ఈ క్షేత్రంలో ప్రతినిత్యం షష్టిపూర్తి అంటే 60 సంవత్సరాలు పూర్తిచేసుకొన్న దంపతులు, సహస్రపూర్ణదర్శనం అంటే వెయ్యి పౌర్ణమిలను దర్శించిన లేక 80 సంవత్సరాలు పూర్తయిన దంపతులు విశేషమైన పూజలు చేస్తుంటారు. అలాగే ఏడాది నిండిన పిల్లలకు ఇక్కడ ఆయుష్ హోమాలు చేస్తుంటారు. ఇవేకాక ప్రతిఏటా చైత్రమాసంలో 18 రోజులపాటు విశేషఉత్సవాలు జరుగుతాయి. ఈ క్షేత్రంలో మరికొందరు దేవతలు భక్తుల గాథలను విశేషంగా చెప్పుకొంటారు. అవి ఇక్కడ ప్రస్తావించడం లేదు.

## దేవతార్చనలో పువ్వులు, ధూపాల ప్రాముఖ్యత

మల్లి, చమేలీ, పొగడ, పున్నాగ మొదలైన పుష్పాలు సకల దేవతలకూ ఎంతో ప్రీతిపాత్రమైనవని మనకు విదితమే. ఈ అంశంమీద మహాభారతంలో ఇచ్చిన వివరాల్ని మీముందుంచుతున్నాను.

ఈ ఘట్టం శ్రీ వ్యాస విరచిత శ్రీమద్మహాభారతంలోని 18 పర్వాల్లోని పదమూడవదైన అనుశాసనపర్వంలోది. అంపశయ్యమీద వున్న భీష్మపితామహుడిని ధర్మరాజు అనేక ప్రశ్నలు వేసాడు. వాటిలో ఒకటి "మానవులు చేసే పూజలో దేవతలకు సమర్పించే పుష్పాలు, ధూపదీపాల గురించి వివరించ"మని. దానికి బదులుగా భీష్ముడు దానవుల గురువైన శుక్రాచార్యుడు, బలిచక్రవర్తుల మధ్య జరిగిన సంవాదాన్ని ఈవిధంగా చెప్పసాగాడు.

* ఒకానొకప్పుడు తపస్సు మాత్రమే ఉండేది. ఆ తర్వాత ధర్మం, మిగిలిన గుణాలు వచ్చాయి. ఈ మధ్యలో అసంఖ్యాకమైన తీగలు, పొదలు, మొక్కలు ఆవిర్భవించాయి. వీటన్నింటికీ అధిదేవత సోముడు. వీటిలో కొన్నింటికి అమృతతుల్య గుణముండగా, మరికొన్ని విషతత్వం కలిగివున్నాయి. ఈ రెండింటి మధ్య వున్న సాధారణ మొక్కలు వేరొక కోవ కిందకి వస్తాయి.
* అమృతతుల్యం అంటే తక్షణమే మనోల్లాసాన్ని కలిగించేవిగా చెప్పవచ్చు. ఇవి చాలా పవిత్రం, మంగళకరమైనవి. వీటి పుష్పాలు మనస్సుని ఆనందింపచేసి మానవులను సుసంపన్నం చేస్తాయి. అందుచేతనే ధర్మబద్ధమైన నడవడిక కలిగిన మానవులని సుమనస్కులు అని సంబోధిస్తారు. నిర్మల మనస్కులైన మనుషులు దేవతలకు అర్పించే పుష్పాల వల్ల వారు సంతృప్తిచెంది వారిని సిరిసంపదలతో అనుగ్రహిస్తారు.
* ఇక విషం అంటే వాటినుండి విడుదలయ్యే వాసనలకి మనస్సు విచలితమౌతుంది అని చెప్పవచ్చు. ఇవి అగ్నితత్త్వం నుంచి ఆవిర్భవించినవి. ఇవి అమంగళకరమైనవి.
* భక్తుడు ఆయా దేవతల, పుష్పాల నామాల్ని ఉచ్చరిస్తూ చేసే క్రతువుల వల్ల తనలో కలిగే భక్తిభావనకు అనుగుణమైన ఫలితాలను పొందుతాడు.
* పుష్పాలను వాటి గుణాలకనుగుణంగా అంటే సాత్విక పుష్పాలు, రాజసిక పుష్పాలు, తామసిక పుష్పాలుగా చెప్పవచ్చు. ఇదేకాక పూలమొక్కలు తుప్పల్లో, జనావాసాల మధ్య, కొండల్లోనూ పెరగగా మరికొన్ని ఎంతో శ్రద్ధతో పెంచితే తప్పించి పెరగవు. కొన్ని ముళ్ళు కలిగివుండగా, మరికొన్ని ముళ్ళులేనివి వుండటాన్ని చూడవచ్చు. ఇంక వాటి పరిమళం, రూపం, రుచులను బట్టి కూడా వర్గీకరించవచ్చు.
* దేవతలను, ముళ్ళులేని మొక్కలపై వికసించి, మధుర సుగంధాలు విరజిమ్మే తెల్లటి పుష్పాలతో పూజించటం అత్యుత్తమం, సర్వశ్రేష్ఠంగా పరిగణించబడుతోంది.
* నీటికొలనుల్లో వికసించే తామర, కలువ వంటి పూలను గంధర్వులు, నాగులు, యక్షులకు సమర్పించవచ్చు.
* ముళ్ళచెట్లకు పూసే ఘాటైన వాసన కలిగి, ఎర్రటి రక్తవర్ణం, ముదురురంగులు కలిగిన పువ్వులను, శత్రువులను బాధించే క్షుద్రపూజలకు వాడతారని అధర్వణవేదంలో ప్రస్తావించబడింది.



ఎంతటి మేధావి అయినా, సమస్య ఎదురైనప్పుడు సమయోచిత నిర్ణయం తీసుకోకపోతే అతడు అసమర్థుడే అవుతాడు.

* చూడచక్కని రూపం కలిగి, మనస్సుని ఉత్తేజపరిచే సువాసన కలిగి, చేతికి మృదువుగా వుండే కుసుమాలను మనుషులకు సమర్పించవచ్చు.
* శ్మశానాలు, సమాధి ప్రాంతాల్లోని పువ్వులను ఎటువంటి శుభ కార్యాలకు వినియోగించరాదు. దేవాలయాల్లోని పువ్వులు, దేవాలయ భూముల్లో ఆయా దేవతల కొరకు పెంచే మొక్కల నుంచి సేకరించిన పుష్పాలను పెళ్ళిళ్ళు, ఇతర శుభకార్యాలకు వినియోగించటం నిషేధించబడింది. వాటిని కేవలం ఆయా దేవతలకు మాత్రమే వినియోగించవలసి వుంటుంది.
* కొండలు, లోయల్లో వికసించి చక్కటి సుగంధం కలిగిన పువ్వులను గంధంనీళ్ళు చిలకరించి నోములు, వ్రత సమయాల్లో శాస్త్ర నియమాలకనుగుణమైన వాటిని వినియోగించవచ్చు.
* దేవతలు, పువ్వుల పరిమళాల చేతనూ, యక్షులు, రాక్షసులు వాటి రంగురూపం చేతనూ, నాగులు వాటి స్పర్శచేతనూ, మానవులు ఈ మూడు అంటే పరిమళం, రంగు, రూపం, స్పర్శ వల్ల సంతుష్టులౌతారు.
* కాబట్టి సత్వగుణం కలిగిన పువ్వులతో దేవతారాధన చేసినప్పుడు వారు సత్వరమే సంతుష్టులై భక్తుల సహజసిద్ధమైన కోర్కెలను వెనువెంటనే తీరుస్తారు. వారిని అవమానించి, నిందించినవారిని బాధిస్తారు.
* ఇక ధూపం గురించి కూడా ఇదేవిధంగా వివరించబడింది. మంగళకరమైనవి, అమంగళకరమైనవి. సాధారణంగా వీటిని ఆయా చెట్ల బెరడు నుండి తయారుచేస్తారు. అగరుధూపం అత్యంత శ్రేష్ఠమైనదిగా చెప్పబడింది. గంధం, సాల, దేవదారు యొక్క ధూపాలు తరువాతి స్థాయిలోకి వస్తాయి.
* కృత్రిమ పదార్థాలతో మానవుల చేత తయారుచేయబడినవి అథమ స్థాయిలోకి వస్తాయి.
* ధూప సువాసనల తత్వాన్ని అనుసరించి పువ్వుల విషయంలో వివరించిన మాదిరిగానే దేవతలు, యక్షులు, నాగులు, దైత్యులు, రాక్షసులు సంతుష్టులై భక్తులను అనుగ్రహిస్తుంటారు.

*(శ్రీ వ్యాసవిరచిత మహాభారతం 13 - అనుశాసనపర్వం 98)*



వ్యాసులవారు మనకందించిన ఈ పుష్ప, ధూప జ్ఞానాన్ని మన ప్రస్తుత పరిస్థితుల కనుగుణంగా అన్వయించుకొని ఆచరించడం మన వంతు ధర్మం. *(మనం పూజలో నిత్యం వినియోగించే సాంబ్రాణి, కర్పూరం, ధూపం అన్నవి చెట్లనుంచి సేకరించిన వివిధ పదార్థాలనుంచి తయారైనవి. ఒకప్పుడు కేవలం ప్రకృతిసిద్ధమైన వాటిని మాత్రమే వాడేవారు. ఈ రోజుల్లో కృత్రిమ రసాయనాలతో తయారైనవి ఎక్కువగా చలామణి అవుతున్నాయి.)*

## వివిధ గ్రంథాల్లో చమేలీ ప్రస్తావన

సంస్కృతంలో చమేలీని మాలతి, జతి అని సంబోధించడం గమనించగలరు.



